క్లుప్తంగా

నేడు ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

ఆత్రేయపురం: మండలంలోని పులిదిండిలో రుక్మిణీ సమేత మీసాల వేణుగోపాలస్వామి ఆలయ శిఖర విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలకు బుధవారం శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 10.58 గంటలకు విగ్రహ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలు పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఘనంగా షిర్డీ సాయి వార్షికోత్సవం

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన షిర్డీ సాయిబాబా అయిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కేరళ వాయిద్య కళాకారుల విన్యాసాలు, మేళతాళాలతో బాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో వైనతేయ గోదావరి నది వద్దకు తీసుకువెళ్లారు. వైనతేయ గోదావరి నదిలో స్నానం చేయించిన అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తూ ఆలయానికి తీసుకు వచ్చారు. మండపేటకు చెందిన షిర్డీ సాయి అమృత వర్షిణి సత్సంగం ఆధ్వర్యంలో పుష్పాభిషేకం ఘనంగా జరిగింది. మహా నైవేద్యం, మధ్యాహ్న హారతిలో భక్తులు భారీగా పాల్గొన్నారు. తాడేపల్లిగూడేనికి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈశ్వర్ గురువు ఆధ్వర్యంలో ప్రదర్శించిన కోలాటం నృత్యం భక్తుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. ధూప్ హారతి, దీపాలంకరణ, శేజ్ హారతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ మంగళవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వెదిరేశ్వరం రోడ్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

వైభవంగా నాగ ప్రతిష్ఠలు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరం పాశర్లపూడిలంకలో కొలువుదీరిన వల్లీ, దేవసేన సమేత నాగేంద్రస్వామి ఆలయం వద్ద నాగ ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ నాగ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. కుటుంబవృద్ధితో పాటు సంతానం కోసం పలువురు దంపతులు, వివాహం కొరకు యువతీ, యువకులు ఈ నాగ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నాగదేవతల ప్రతిమలకు పూజలు నిర్వహించిన తర్వాత వాటిని ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. ముందుగా నాగేంద్రస్వామికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం మధ్య శాస్త్రోక్తంగా నాగేంద్ర స్వామికి పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి లక్ష బిల్వార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద గురువారం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రాజోలులో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న జేఏసీ నాయకులు

రాజోలు: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజోలు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు మంగళవారం తహసీల్దార్ ఎం.పాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల పది డిమాండ్ల పరిష్కారం కోసం దశల వారీగా ఈ నెల 27వ తేదీ వరకు ఆందోళన చేపడుతున్నట్లు జేఏసీ రాజోలు యూనిట్ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యదర్శి ఐ.ప్రతాప్‌రాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు 36 మందికి కంటి పరీక్షలు చేశారు. ఐదుగురికి ఉచిత ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించారు. హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు, కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పళ్లాలమ్మ క్షేత్రానికి నూతన వైభవం

- వానపల్లిలో రూ.84.50 లక్షలతో ఆలయ ముఖమండపం, రాజగోపురం నిర్మాణం
- నేడు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు భాస్కరరామం చేతుల మీదుగా శిఖర ప్రతిష్ఠ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు



వానపల్లి పళ్లాలమ్మ ఆలయం వద్ద నిర్మించిన ముఖ మండపం, రాజగోపురం

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవతగా, ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న పళ్లాలమ్మ అమ్మవారి క్షేత్రం నూతనంగా సుమారు రూ.1.80 కోట్లతో నిర్మించిన కట్టడాలతో సరికొత్త వైభవాన్ని సంతరించుకుంది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఆ గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం (ప్రజా ప్రయోజనాలు) ప్రత్యేక కృషి మేరకు దేవదాయ–ధర్మాదాయ శాఖ సీజీఎఫ్ నిధుల మంజూరుతో ఆలయ ముఖ మండపం, రాజగోపురం నిర్మాణం కాగా బుధవారం వాటి ప్రారంభోత్సవం, శిఖర ప్రతిష్ఠ, ప్రాకార మండపానికి భూమిపూజ నిర్వహించేందుకు ఆ దేవస్థానం కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పళ్లాలమ్మను ప్రకృతిమాతగా కొలిచిన సీతాదేవి

సీతారాములు వనవాస కాలంలో పళ్లాలమ్మ అమ్మవారిని కొలిచినట్టు ప్రకృతిమాతగా సీతాదేవి స్థల పురాణంలో పేర్కొన్నారు. బ్రిటిష్ వారి పాలనలో సర్ ఆర్థర్ కాటన్ బీడు భూములను పంట భూములుగా మార్చాలనే తలంపుతో అఖండ గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మించి, కాలువలను తవ్వించి, సాగునీరు మళ్లించినప్పుడు నాడు వానరపల్లి అనబడే నేటి వానపల్లి వద్ద పళ్లాలమ్మ ఆలయం అడ్డురాగా ఇంజినీరింగ్ అధికారులు ఆలయం తొలగించే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నాన్ని కాటన్ వారించి ఆలయాన్ని అలాగే ఉంచి ఆలయం పక్క నుంచి కాలువ వెళ్లేలా అక్కడ వంపు తిప్పమని సూచించినట్టు కూడా ఆ స్థల పురాణంలో పేర్కొన్నారు. అలా ఆ ఆలయం చెక్కుచెదరకుండా నిలిచింది. విజయనగర సంస్థానాధీశుల పాలనలో పలువురు భూస్వాములు ఈ ఆలయానికి 39 ఎకరాలు భూమి దానం చేయగా దానిలో పూర్వీకులు నిర్మించిన ఈ ఆలయం 1969లో దేవదాయ శాఖ పరిధిలో విలీనమైంది. నాడు సీతాదేవి కొలిచిన ఈ అమ్మవారు ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పుగా గుర్తింపు పొందింది. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం నుంచి తీర్థం ప్రారంభమై నెలరోజుల పాటు జరగడం పూర్వం నుంచీ ఆనవాయితీగా వస్తుంది.

నేడు ప్రారంభోత్సవం

ఆలయ ముఖమండపం, రాజగోపురాన్ని బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు భాస్కరరామం ప్రారంభించనున్నారు. ప్రత్యేక పూజలతో రాజగోపురం శిఖర ప్రతిష్ఠ చేయనున్నారు. అనంతరం రూ.85 లక్షల సీజీఎఫ్ నిధులతో ఆలయం చుట్టూ నిర్మించే ప్రాకార మండపం నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు.

ఎమ్మెల్యే చిర్ల, నేమాని సంయుక్త ఆధ్వర్యంలో అభివృద్ధి

ఎన్నో సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టున్న ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం సంయుక్త ఆధ్వర్యంలో రూపకల్పన చేశారు. ఆ ప్రతిపాదనలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆమోదంతో ఆలయ ముఖ మండపం, రాజగోపురం నిర్మాణానికి రూ.80 లక్షలు దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించారు. దానికి మ్యాచింగ్ గ్రాంటు రూ.8 లక్షలు చెల్లించవలసి ఉండగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.3 లక్షలు, పాలకమండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, కొత్తపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు రూ.లక్ష చొప్పున, 2007 జాతర కమిటీ రూ.1,77,777, గ్రామస్తులు రూ.1.25 లక్షలు చెల్లించారు. మండపంపైన శాలాహారాన్ని చైర్మన్ అమ్మన్న ఆధ్వర్యంలో దాతల నుంచి రూ.4.50 లక్షలు సేకరించి నిర్మించారు.

చరిత్రలో అభివృద్ధి కార్యక్రమాలు



ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామ దేవత పళ్లాలమ్మ ఆలయం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, మా గ్రామస్తుడైన ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం సహకారం, ప్రభుత్వంలో వారికున్న పలుకుబడి అభివృద్ధికి దోహదపడింది. నేడు వారి కృషితో జరిగిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు చరిత్రలో నిలుస్తాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన వారందరికీ పాలక మండలి, గ్రామం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. భవిష్యత్‌లో జగ్గిరెడ్డి, భాస్కరరామం కృషి, దాతల సహకారంతో మొక్కుబడులు తీర్చుకునే భక్తులు వంటలు చేసుకుని, భోజనాలు చేసుకునేందుకు వీలుగా షెడ్లులు నిర్మించే ప్రతిపాదన ఉందన్నారు.

– కామిశెట్టి అమ్మన్న, దేవస్థాన పాలకమండలి చైర్మన్, వానపల్లి

మేము సైతం సిద్ధం

- ఎమ్మెల్యే రాపాక
- మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

సఖినేటిపల్లి: రానున్న ఎన్నికల సమరానికి నేనే సిద్ధం అంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి మీరు సిద్ధంగా ఉన్నారా అంటూ అక్కాచెల్లెమ్మలను ప్రశ్నించిన రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు, మేము సైతం సిద్ధంగా ఉన్నామంటూ వారు చేసిన కరతాళ ధ్వనులతో వైఎస్సార్ ఆసరా సంబరాలు సమావేశం మార్మోగింది. మంగళవారం స్థానిక సమతా కల్యాణ మండపం ఆవరణలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే రాపాక, మహిళా సమాఖ్య క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం నాలుగో విడతలో 16 గ్రామాల్లోని 1246 డ్వాక్రా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకంలో మంజూరైన రూ.9,96,08,763 విలువ చేసే మెగా చెక్కును ఎమ్మెల్యే రాపాక, డ్వాక్రా సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎంగా జగన్ వచ్చాక మొత్తం నాలుగు విడతల్లో అక్కా చెల్లెమ్మలకు రూ.39,78,82,155 ఆర్థిక సాయం చేశారన్నారు. అక్కా చెల్లెమ్మలు అంటే జగనన్నకు ఎంతో ప్రేమ అని, వీరికి ఉన్నత స్థానాలు, గౌరవ ప్రదమైన స్థానాలు కల్పించాలన్న సంకల్పంతో సీఎం జగన్ అన్నింటా 50 శాతం మహిళల రిజర్వేషన్లు కల్పించారన్నారు. నేనే మేలు చేస్తేనే ఓటు వేయండి అంటూ జగనన్న ఎన్నికలకు వస్తున్నారన్నారు. ప్రతిపక్షాలకు ఇటువంటి దమ్ము, ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే పేదలకు సేవలందించే సౌలభ్యం సీఎం జగన్ కల్పించారన్నారు. ఇన్ని మంచి పనులు చేసిన ప్రభుత్వం మరొకటి లేదని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్‌లు నొక్కి మంచి పేదల సంక్షేమ పాలనను తెచ్చుకుందాం అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఏపీఎం విజయ్, జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, మట్టా శైలజ, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చిన రాజా, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్‌ప్రభాకర్, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీడీవో బి.మంగాదేవి, గెడ్డం సులోచన, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లిలో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



అంబాజీపేటలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

మహిళల స్వయం సమృద్ధే ప్రభుత్వ లక్ష్యం

అంబాజీపేట: మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో మండల పరిధిలోని 10,285 డ్వాక్రా సంఘాలకు రూ.9.70 కోట్లు వైఎస్సార్ ఆసరా చెక్కులు అందజేశారు. ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన సభలో విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిన జగన్‌కు మహిళలు అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. కేవలం అధికారం కోసమే పొత్తులు పెట్టుకుని ప్రజల్ని వంచించేందుకు వస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకటరాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, పీఏసీఎస్ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, నాగాబత్తుల సత్యానందరావు, కొర్లపాటి కోటబాబు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

రావులపాలెం: మండలంలోని లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీకి చెందిన వారంతా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరిపాలన దక్షతకు ఆకర్షితులై, మాట మీద నిలబడని టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు తెలిపారు. పార్టీలో చేరిన అత్తిలి దేవదాసు, కట్టా రాజ్‌కుమార్, కట్టా చందు, నాగుల భాస్కర్, ముప్పిడి సుబ్రహ్మణ్యం, బండి నాని, అత్తిలి విజయరాజు, బీర హరి, మేడిచర్ల నాగరాజు, పితాని ప్రసాద్, వెలిగంటి నాగరాజు, వెల్లంపాలెపు వెంకన్న, వెల్లంపాలెపు ప్రసాద్ తదితరులను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తున్నారని ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. ఈదరాడలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత, ఎం.స్పందన ఆధ్వర్యంలో ఆప్తాలమిక్ హుస్సేన్ జానీ, పీడియాట్రిస్ట్ అనూష, ఎండీ జనరల్ సర్జన్ ఎం.సుమంత్ సుమారు 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శిబిరానికి వచ్చిన వారికి పలు రకాల పరీక్షలు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ చూపుతున్నారని ఎంపీపీ వనజకుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రజలకు సేవలందించారు. వైఎస్సార్ సీపీ నేతలు యెరుబండి సత్యనారాయణమూర్తి, చేట్ల సత్యనారాయణ, పాలమూరి సూరిబాబు, కుసుమ శ్రీధర్, ఉచ్చుల విష్ణు, కార్యదర్శి పీవీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.



ఈదరాడలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్పందన

ఇరుసుమండలో..

అంబాజీపేట: వైద్యంతో పాటు విద్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి చెప్పారు. ఇరుసుమండలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. జెడ్పీటీసీ వరలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలను ప్రజలకు చేరువ చేశారన్నారు. డాక్టర్లు ఎ.సూర్యనాగేష్, పవన్‌సాయి, ఎస్‌కే మౌలాలి, ఆప్తాలమిక్ మీర్జా హుస్సేన్ ప్రజలకు వైద్య సేవలందించారు. ఎమ్మార్వో జె.విమలకుమారి, సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ బూడిద సత్యనారాయణమ్మ శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంటి పాల్గొన్నారు.

ఉపాధి తనిఖీకి అందరూ సహకరించాలి

కొత్తపేట: ఉపాధి హామీ ద్వారా గత ఆర్థిక సంవత్సరం మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై గ్రామాల్లో జరిగే సామాజిక తనిఖీకి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకరించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సామాజిక తనిఖీపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి అధికారులు, సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ కందుల వాణి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఉపాధి పథకం ఏపీఓ ఎన్.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 10 గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకూ ఉపాధి పథకం కింద చేసిన 260 పనులకు సంబంధించి వేతనాల రూపంలో రూ.6,78,77,653 కాగా మెటీరియల్‌కు రూ.2,07,97,968తో మొత్తం రూ.8,86,75,622 ఖర్చు చేసినట్టు వివరించారు. ఆయా పనులకు సంబంధించి డీఆర్‌పీ, ఎస్ఆర్‌పీల ఆధ్వర్యంలో విలేజ్ సోషల్ ఆడిటర్లు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఎంపీపీ గంగాధరరావు మాట్లాడుతూ ఈ ఉపాధి సామాజిక తనిఖీ సమగ్రంగా నిర్వహించాలని అన్నారు. ఈ సదస్సులో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్ సాగి బంగార్రాజు, ఎంపీటీసీ సభ్యులు నేలపూడి భీమరాజు, ముళ్ల జనార్దనరావు, మోడేకుర్రు, ఖండ్రిగ వీడీసీ కన్వీనర్లు కుడుపూడి వెంకటేశ్వరరావు, దూనబోయిన శ్రీనివాసరావు, సోషల్ ఆడిట్ డీఆర్‌పీ పి.కోటేశ్వరరావు, ఎస్ఆర్‌పీ సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

చైతన్య సమితి నూతన కార్యవర్గం

మలికిపురం: విశ్వేశ్వరాయపురం అంబేడ్కర్ భవనంలో రాజోలు నియోజకవర్గ పరిరక్షణ చైతన్య సమితి అధ్యక్షుడు గెడ్డం బాలరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా చింతా సత్య, అధ్యక్షుడిగా నల్లి ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా మంద సత్యనారాయణ, కోశాధికారిగా పోతుల శేఖర్, ఉపాధ్యక్షులుగా విప్పర్తి సాయిబాబా, కుడుపూడి శివమణి, చుట్టుగుల్ల నరసింహారావు, కార్యదర్శులుగా, చెవ్వాకుల వెంకట్, జనిపల్లి సత్యానందం, రాపాక రత్నంరాజు, లీగల్ అడ్వైజర్, గెడ్డం బాలరాజ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ముత్యాల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా రాపాక కిరణ్, బూసి జాన్ మోసే, బడుగు సాయిబాబా, రుద్రరాజు వెంకట నరసింహరాజు, పమ్మి రత్నంరాజు, పెదపాటి శ్యాం ప్రసాద్, కొల్లాబత్తుల భాస్కర్, వట్టూరి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు ప్రసాదరావు

అగ్నిప్రమాద బాధితులకు ‘విప్పర్తి’ సాయం

పి.గన్నవరం: పోతవరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పి.వెంకాయమ్మ, శ్రీనివాసరావుల తాటాకిల్లు దగ్ధమై రెండు కుటుంబాల వారు నిరాశ్రయులైన విషయం విదితమే. బాధిత కుటుంబాలకు మంగళవారం విప్పర్తి ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు పులపర్తి రాజారావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సబ్బితి చినబాబు, మోకా సత్యనారాయణ, గుత్తుల దాసు, మట్టపర్తి పండు, ఆచంట వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

రావులపాలెం: రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం సీనియర్ అడ్వకేట్ వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు విశాఖపట్నానికి చెందిన సీనియర్ అడ్వకేట్ ఎ..వెంకటలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారత దేశంలో వినియోగదారుని చట్టాలు చక్కగా పనిచేస్తున్నాయన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉన్న హక్కులపై వినియోగదారులకు భంగం కలిగినప్పుడు ఈ చట్టాల ద్వారా న్యాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల కౌన్సిల్ విశాఖపట్నం జిల్లా సభ్యులు ప్రసాద్ రాజు, భరద్వాజ, మౌళి, నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏపీఓ నాగబాబు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల నిమిత్తం క్షేత్రసాయి సిబ్బందితో ప్రణాళికలు, అంచనాలు మొదలైన అంశాలు సమీక్షించారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



బండారు సాయినరేన్



బొక్కా నవదీప్



అద్దరు శ్రీసాయి విద్యాధర్

కొత్తపేట: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కొత్తపేట మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటి ఉత్తమ ఫలితాలు సాధించారు. వారిద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయుల తనయులే. వారిలో ఒకరు వాడపాలెం గ్రామానికి చెందిన బండారు సాయినరేన్ 99.95 శాతం మార్కులు సాధించగా మరొక విద్యార్థి బొక్కా నవదీప్ 99.92 శాతం మార్కులు సాధించాడు.
వాడపాలెం గ్రామానికి చెందిన బండారు సాయినరేన్, బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం గ్రామానికి చెందిన బొక్కా నవదీప్‌లు రాజమహేంద్రవరం తిరుమల కాలేజ్‌లో చదువుతున్నారు.
ఆలమూరు: స్థానిక ఖండ్రిగపేటకు చెందిన అద్దరు శ్రీసాయి విద్యాధర్ జేఈఈ మెయిన్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 99.1 శాతం మార్కులు సాధించి తమ సత్తా చాటాడు. ప్రస్తుతం ఆ విద్యార్థి విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఎంపీసీ చదువుతున్నాడు. సాయి విద్యాధర్ తండ్రి శ్రీనివాసరావు ఉపాధ్యాయుడు కాగా తల్లి జ్యోతి స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సీఆర్‌పీగా పనిచేస్తున్నారు. జాతీయ స్థాయిలో సరికొత్త ఆవిష్కరణలు ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తానని ర్యాంకర్ శ్రీసాయి విద్యాధర్ తెలిపారు. అత్యధిక శాతం మార్కులు సాధించిన శ్రీసాయి విద్యాధర్‌ను మండల విద్యాశాఖ అధికారులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని లక్ష్మీపోలవరంలో మంగళవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. పలు సీసీ రోడ్లు, అరుంధతి పేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. అలాగే ప్రజలకు తాగునీరు కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు రూ.67.50 లక్షలతో నిర్మించిన ఇంటింటికీ నీటి కుళాయి పథకం వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అలాగే గ్రామంలో 396 మంది ఆడపడుచులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. రవిక, గాజులు, పసుపు కుంకుమలతో సొంత పుట్టింటి వారు అందజేసినట్టు ఇళ్ల పట్టాలను ఆడపడుచులకు అందజేశారు.

గ్రూప్–2 పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజేశ్వరరావు

మలికిపురం: మండలంలోని ఏఎఫ్‌డీటీ ఎయిడెడ్ విద్యా సంస్థల ఆవరణను మంగళవారం డీఎల్డీఓ ఎస్.రాజేశ్వరరావు పరిశీలించారు. ఈ నెల 25న గ్రూప్–2 పరీక్షలను నిర్వహించేందుకు పరిశీలన చేశారు. సుమారు 700 మంది దరఖాస్తుదారులు ఇక్కడ పరీక్ష రాసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, ఏఓ ఎస్.రాకేశ్ ఆయన వెంట ఉన్నారు.

నియమాలు పాటిస్తే ప్రమాదాలు దూరం

రాజోలు: ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు దూరమవుతాయని రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ పి.భాస్కరరావు అన్నారు. మంగళవారం రాజోలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఆర్టీసీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను డీఎం భాస్కరరావు వివరించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు.

దశలవారీ ఉద్యమం విజయవంతం చేయాలి

కొత్తపేట: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు గత ఐదు సంవత్సరాలుగా చెల్లించవలసిన బకాయిల సాధనకు ఏపీ జేఏసీ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణ ప్రకారం దశల వారీ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కొత్తపేట తాలూకా జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 27 వరకూ ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ఈ దశల వారీ ఉద్యమ కార్యక్రమాల్లో ఉద్యోగులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తీర్మానించారు.